క్లుప్తంగా

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి : పదో తరగతి పాసైన వారు ఓపెన్ ఇంటర్‌లో చేరేందుకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్, గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చత్రునాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్‌లో ఒకే ఏడాదిలో ఇంటర్ పూర్తిచేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6304949238ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే నడిగూడెం ఫీడర్ పరిదిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కె.సైదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శిగా వెంకటనారాయణ



మఠంపల్లి : బ్లాక్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతల వెంకటనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు హుజూర్‌నగర్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ వెంకటనారాయణకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం మఠంపల్లిలో వెంకటనారాయణ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన శాయశక్తులా కృషిచేస్తానని తెలిపారు.

తడి, పొడి చెత్త వేరుచేయడంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా శనివారం 1, 8వ వార్డుల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త వేరు చేయూ విధానం, ఎరువుల తయారీపై ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డుల్లో ర్యాలీని నిర్వహించారు. పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు ఉన్నారు.

కాలువలో పడిన గేదె.. కాపాడిన స్థానికులు



గేదెను బయటకు తీస్తున్న స్థానికులు

హుజూర్‌నగర్ : కాలువలో పడిన గేదెకు దెబ్బలు తగిలి ప్రాణాపాయ స్థితిలో ఉండగా స్థానికులు బయటకు తీసి కాపాడారు. ఈ సంఘటన శనివారం హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పట్టణ పరిధిలోని మట్టపల్లి బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఐదు అడుగుల లోతు ఉన్న డ్రెయినేజీలో ప్రమాదవశాత్తు ఒక గేదె పడింది. స్థానికులు గమనించి కోలపూడి యోహాన్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డికి తెలియజేశాడు. దీంతో గేదె ట్యాగ్ నంబర్ స్కాన్ చేసి బక్కమంతులగూడెం గ్రామానికి చెందినదిగా గుర్తించారు. స్థానికులు తాళ్ల సహాయంతో గేదెను బయటకు తీసారు. గేదెను కాపాడిన వారిలో డి.సైదులు, బి.నాగేశ్వరరావు, రాజు, ధని, శ్రీను, రసీదు, నాగరాజు, రజాక్, సైదులు, నరసింహారావు, లింగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

గరిడేపల్లి : జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు యాకూబ్ కోరారు. శనివారం మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం పల్లె దవాఖానలో ఆయన ఆశ వర్కర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు చట్టాలుగా మార్చి వాటి అమలు కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. నాలుగు చట్టాల అమలైతే కార్మికుల జీవనం ఇబ్బందిలో పడుతుందని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కనీస వేతనం సుప్రీంకోర్టు జీవో ప్రకారంగా రూ. 26వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భవాని, సైదమ్మ, వంశీ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ కోరారు. శనివారం వేణుగోపాలపురంలో నిర్వహించిన కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి సంపతి పిచ్చయ్య, నాయకులు రేఖ తిరపయ్య, లక్ష్మి, నాగమ్మ, అన్నమ్మ పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలలో అధికారులు, నాయకులు, పోలీసులు, ఉపాధ్యాయు లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రతిఒక్కరూ తమ జీవనంలో యోగాను భాగం చేసుకోవాలని యోగా గురువులు సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



హుజూర్‌నగర్‌లో యోగా చేస్తున్న సీఐ చరమందరాజు, పోలీస్ సిబ్బంది



నేరేడుచర్ల : సరస్వతి శిశు మందిర్‌లో..



కోదాడరూరల్ : యోగాసనాలు వేస్తున్న డీఎస్పీ, రూరల్ సీఐ, ఎస్ఐ , సిబ్బంది



మునగాల : కస్తూరిబా పాఠశాలలో యోగా చేస్తున్న పోలీసులు, విద్యార్థినులు



నడిగూడెం : బాలికల గురుకుల పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



మేళ్లచెరువు కేజీబీవీలో ..



చిలుకూరు : గ్లోబస్ పాఠశాలలో..



కోదాడరూరల్ : యోగాసనాలు వేస్తున్న యోగా గురువు ప్రసాద్‌రావు, శిష్యులు



చిలుకూరు : బేతవోలులో యోగా అక్షరాల ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన



గరిడేపల్లిలోని నర్సరీ వద్ద యోగా చేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు



పాలకవీడు : డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో..



మునగాలలోని ఆదర్శ పాఠశాలలో..

మట్టపల్లిలో నిత్యకల్యాణం



మట్టపల్లి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మిసమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మదుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గరుడవాహనంపై శ్రీస్వామివారిని ఆలయ తిరుమాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో చత్రునాయక్

గరిడేపల్లి : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠ్య, నోట్ బుక్స్, యూనిఫాంను ఇప్పటికే పాఠశాలలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.సువర్ణ, నాగమణి, కనకయ్య, నరసకుమారి, ప్రసన్నకుమారి, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, గోవిందు, రాజారావు, బాలసైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

సూర్యాపేట అర్బన్ : ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోకుండా నడుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సూర్యాపేటలో జిల్లా రవాణా శాఖ అధికారి ప్రకాశ్‌రెడ్డికి వినతి పత్రం అందించి మాట్లాడారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, దూదిపాల ప్రవీణ్, మండడి శ్రీధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న లారీ.. తప్పిన ప్రమాదం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం అర్ధరాత్రి లారీ ఢీకొట్టింది. డ్రైవర్ లారీ రివర్స్ చేస్తుండగా ఢీకొని విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగిపోయింది. అర్ధరాత్రి సమయంలో జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

గోదాం నిర్మాణంతో రైతులకు ప్రయోజనం



గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్, నాయకులు

కోదాడరూరల్ : గోదాం నిర్మాణంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కోదాడ పీఏసీఎస్ పరిధిలోని గుడిబండలో సంఘం నిధులు రూ. 32 లక్షల వ్యయంతో నిర్మించనున్న 500 మెట్రిక్ టన్నుల ధాన్యం గోదాం పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ బుడిగం నరేష్, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, డైరెక్టర్‌లు, రైతులు ఉన్నారు.

రోడ్డు వెంటే పెంటదిబ్బలు.. ప్రయాణానికి కష్టాలు



సీతారాంతండా శివారులో రోడ్డుకు ఇరుపక్కలా పెంటకుప్పలు

చిలుకూరు : మండలంలోని సీతారాంతండా శివారులో రోడ్డు వెంట తండావాసులు పెంటదిబ్బలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్జిన్‌లో వదికి పైనే పెంటదిబ్బలు వేయడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు. తండావాసులు పోటీ పడి రోడ్డు వెంట పెంటదిబ్బలు వేస్తున్నారని, దీంతో గ్రామంలో పలువురి మధ్య వివాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఈ రోడ్డు కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై గల హుజూర్‌నగర్ మండలం రాయినిగూడెం నుంచి సీతారాంతండా, బేతవోలు, పోలేనిగూడెం గ్రామాల మీదుగా విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిని కలుపుతుంది. నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కావున గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు వెంట పెంటకుప్పలను తొలగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

పాలడుగు ప్రసాద్ సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే పద్మావతి



ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

నడిగూడెం : కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు పాలడుగు ప్రసాద్ (56) చేసిన సేవలు మరువలేనివని, ఆయన అకాల మృతి పార్టీకి తీరని లోటని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పాలడుగు ప్రసాద్ సంతాప సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శనివారం నేరేడుచర్లలో తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకారపు వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి సుందరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, బత్తిని శ్రీనివాస్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు చందమళ్ల నవీన్, మచ్చ సందీప్, లింగయ్య, చింతలచెరువు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

గరిడేపల్లి : వికలాంగుల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాకే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. తమకు రిజర్వేషన్ కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై వికలాంగుల సమాజం యుద్ధం చేస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని, వికలాంగుల అట్రాసిటీ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరారు. ఆర్టీసీలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేసి ప్రత్యేక శాఖ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ కుర్ర గోపి, ప్రధాన కార్యదర్శి గుర్రం నరేష్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు నాగమణి, సంఘం మండల నాయకులు వెంకటేశ్వర్లు, వనజా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



సిటీ సెంట్రల్ స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కోదాడరూరల్ : బెస్ట్ అవైలబుల్ స్కీం కింద కోదాడ పట్టణంలోని సైదయ్య, సిటీ సెంట్రల్ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వకుండా యజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపిస్తూ పిల్లల తల్లిదండ్రులు శనివారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. నిరుపేద ఎస్సీ విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద విద్యార్థులను ఎంపిక చేసి కేటాయించిన పాఠశాలలో ఉచిత విద్యను అందిస్తుందని తెలిపారు. కానీ పట్టణంలోని రెండు పాఠశాలలు ప్రభుత్వం స్కీమ్‌కు సంబంధించిన నిధులు తమకు రాలేదంటూ విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వకుండా, బస్సులు పంపించకుండా, హాస్టల్ వసతి కల్పించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి తమ పిల్లలకు న్యాయం చేయాలని లేని పక్షంలో విషయాన్ని కలెక్టర్, సంబంధిత శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుండెపంగు రమేష్, కుక్కల కృష్ణ, బ్రహ్మం, సైదులు, బాలసైదులు, సురేష్, కల్పన, నిర్మల ఉన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



మఠంపల్లి : బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న గౌడ కులస్తులు



మఠంపల్లి : పూజలో పాల్గొన్న గౌడ కులస్తులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవి దేవాలయ తృతీయ వార్షికోత్సవాన్ని గౌడ కులస్తులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ్‌లు తమ గీత వృత్తిలో ప్రధానమైన మోకు, ముస్తాదు ధరించగా, మహిళలు బోనాలు ఎత్తుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి, అమ్మవార్లకు బోనాలు నైవేద్యంగా సమర్పించారు. వేడుకకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాది గౌడ కులస్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక గౌడ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల శ్రీసురమాంబ కంఠమహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగ్ సైదులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం జలబిందెల కార్యక్రమం, 23న స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం గంపలు, బోనాలతో ఆలయానికి వెళ్లుట, రాత్రి స్వామివారి కల్యాణం, 24న తెల్లవారుజామున వన ఎల్లమ్మ, వనమైసమ్మ దేవతలకు బలి అర్పణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఉపాధి పథకం.. పాడి రైతులకు ఊతం

తొలివిడతగా 52 పశువుల కొట్టాలు మంజూరు

- మూడునెలల్లో నిర్మాణాలన్నీ పూర్తి
- బిల్లుల కోసం ఎదురుచూపు



శ్రీరంగాపురంలో నిర్మించిన పశువుల కొట్టం



వేణుగోపాలపురంలో..

నడిగూడెం : పాడి పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల కొట్టాల నిర్మాణానికి అవకాశం కల్పించాయి. దీంతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. నడిగూడెం మండల వ్యాప్తంగా తొలి విడతగా 52 పశువుల కొట్టాలు మంజూరయ్యాయి. దీంతో పాడి రైతులు మూడు నెలల్లోనే అన్ని పశువులు కొట్టాల నిర్మాణాలను పూర్తి చేశారు. జాతీయ ఉపాధి హామీ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం నిర్మించుకున్నారు. అయితే పశువుల కొట్టం నిర్మాణానికి ప్రభుత్వం పాకల కొలతల ప్రకారం రూ.60 వేల నుంచి రూ.85 వేల వరకు అందిస్తుంది. కాగా, మండలంలో పశువుల పాలకలు నిర్మించుకున్న లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.

మంజూరైనవి ఇవీ..

మండలానికి మంజూరైన వాటిలో బృందావనపురంలో 02 పశువుల కొట్టాలు నిర్మించారు. చాకిరాలలో- 6, ఎఖలాస్‌ఖాన్‌పేట- 01, కాగితరామచంద్రాపురం- 03, కరివిరాల- 04, కేశ్వాపురం- 09, నడిగూడెం- 05, నారాయణపురం- 01, రామాపురం- 05, రత్నవరం - 02, శ్రీరంగాపురం- 09, తెల్లబల్లి- 02, వేణుగోపాలపురం - 02, వల్లాపురం- 01 ఇలా మొత్తం 52 పశువుల కొట్టాలను చిన్న, సన్నకారు రైతులు నిర్మించుకున్నారు. పశువుల కొట్టాలను పాడి రైతులు సొంత డబ్బులతోనే నిర్మించుకున్నారు. మరో 10 రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో ఈ పథకానికి సంబంధించిన బిల్లులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు.

పశువుల కొట్టం నిర్మించుకున్నాం



జాతీయ ఉపాధి హామీ పథకం కింద నాకు పశువుల కొట్టం మంజూరు కావడంతో నిర్మించుకున్నా. నాకున్న ఆరు పాడి గేదెలకు ఈ కొట్టం సౌకర్యంగా ఉంది. ప్రస్తుత వర్షాకాలంలో పశువులకు ఎలాంటి ఇబ్బంది లేదు.

– ఎల్.వీరబాబు, లబ్ధిదారుడు, శ్రీరంగాపురం

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో మంజూరైన 52 పశువుల కొట్టాల నిర్మాణం పూర్తయింది. ఈ పశువుల కొట్టాలను వంద శాతం రాయితీపై ప్రభుత్వం మంజూరు చేయడంతో లబ్ధిదారులు కూడా ముందుకొచ్చి నిర్మించుకున్నారు. ఈ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. బిల్లులు త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి.

– హరిసింగ్, ఎంపీడీఓ, నడిగూడెం